పరువు పోయె..!



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

- శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు బి++ గ్రేడ్ కేటాయింపు
- గతంతో పోలిస్తే దిగజారిన కళాశాల సీజీపీఏ స్కోర్
- నాక్ పర్యటన సమయంలో ఎమ్మెల్యే శంకర్ రాక పట్ల కమిటీ అసంతృప్తి
- విద్యాసంస్థల్లో రాజకీయ రంగప్రవేశంతో అప్రతిష్టపాలు
- ప్రిన్సిపాల్, అధ్యాపకులు మధ్య బహిర్గతమైన విభేదాలు!

శ్రీకాకుళం న్యూకాలనీ: సుమారు ఏడు దశాబ్దాల కిందట ఏర్పాటై మినీ యూనివర్సిటీలా పేరొందిన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎంతో విశిష్టత, గుర్తింపును సొంతం చేసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ రంగును పులుముకుంది.కళాశాలకు జనవరి 23, 24 తేదీల్లో నాక్ పీర్ కమిటీ పరిశీలన సందర్భంగా రాజకీయ రంగ ప్రవేశంతో కథ మొత్తం మారిపోయింది. గతం కంటే కాస్త మెరుగైన గ్రేడ్ వస్తుందన్న ఆశలన్నీ అడియాసలయ్యాయి. గతంలో మాదిరిగానే బీ++ గ్రేడ్ కేటాయిస్తు.. 2.85 సీజీపీఏ స్కోర్‌తో పాయింట్లను కేటాయిస్తు నాక్ కమిటీ ఉత్తర్వులు వెల్లడించింది. గతంలో 2.90 సీజీపీఏ స్కోర్ సాధించిన విషయం తెలిసిందే.



కళాశాల పరిశీలన సందర్భంలో నాక్ కమిటీ వెంట స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్

ఎమ్మెల్యే రాకపై తీవ్ర అసంతృప్తి..

ఈ నెల 23, 24 తేదీల్లో కళాశాలను ముగ్గురి సభ్యులతో కూడిన నాక్ బృందం పరిశీలించింది. ఇందులో కర్ణాటకలోని కువెంపు యూనివర్సిటీ పూర్వపు వీసీ డాక్టర్ మంజునాథ్ టి.రాజప్ప ఛైర్‌పర్సన్‌గా, గౌహతి యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జోగెన్చంద్ర కలీటా, సోలాపూర్ వాల్చంద్ కళాశాల(ఆర్ట్స్,సైన్స్) ప్రిన్సిపాల్ సంతోష్ కోటి సభ్యులుగా, డాక్టర్ ఏ.వి.ప్రసాద్ నాక్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కళాశాలను అణువణువు, అన్ని విభాగాలను, భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే నాక్ పీఆర్ కమిటీ కళాశాల విజిట్ సందర్భంగా అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ రంగ ప్రవేశం చేయడం, వారిని ఆజ్ఞాపించే రీతిలో కళాశాలకు మెరుగైన గ్రేడ్ పాయింట్లు కేటాయించాలని కోరడం వారిలో తీవ్ర అసంతృప్తిని రాజేసిందని తెలిసింది. ఉన్న రెండు రోజులు కూడా అసహనంతోనే పరిశీలన చేసినట్టు పూర్వ విద్యార్థుల్లో ఒక విశ్రాంత అధికారి అభిప్రాయపడ్డారు.

వర్గ విభేదాలు, సమన్వయ లోపం..

కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది వర్గాలు, వారి మధ్య విభేదాలు నాక్ కమిటీ సాక్షిగా బహిర్గతమయ్యాయి. ప్రిన్సిపాల్, అధ్యాపకుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. ఇదే విషయాన్ని నాక్ పీఆర్ కమిటీ గుర్తించింది. ముఖ్యంగా కొన్ని గ్రూపుల పిల్లలతో ఇంటరాక్షన్ జరిపించలేదని స్వయంగా ఫిర్యాదులు అందాయని.. దీనిపై వారు ప్రిన్సిపాల్ వివరణ కోరడం , అలాగే గ్రేడ్ కేటాయించకముందే వివిధ అంశాలు, ఫిర్యాదు, ఆరోపణలపై సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆన్‌లైన్ అసెస్‌మెంట్‌తో మరింత నష్టం..

కళాశాల సమస్యలకు తోడు తాజాగా కేంద్రమంత్రిత్వశాఖ తీసుకొచ్చిన ఆన్‌లైన్ అసెస్‌మెంట్ సైతం నష్టాన్ని మిగిల్చింది. గత మూడు పర్యాయాలు నాక్ కమిటీ 100 వంద శాతం ఫిజికల్‌గా వెరిఫికేషన్ జరిపేది. ప్రస్తుతం 30 శాతం ఫిజికల్, మిగిలిన 70 శాతం ఆన్‌లైన్‌లో ప్రగతి, ఫలితాలు, కార్యక్రమాలు డాక్యుమెంటేషన్ రూపంలో చూపించాల్సిన పరిస్థితి తలెత్తడంతో పరిస్థితి జఠిలమైందని భావిస్తున్నారు.

మెరుగైన గ్రేడే..

ఎస్ఎస్ఆర్ అప్లోడ్ సమయంలో నన్ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఎస్ఎస్ఆర్ క్లోజ్ అయిన సమయంలో మళ్లీ ఇక్కడ నియమించారు. ఇక్కడ ఉన్న అధ్యాపకుల్లో కొంతమంది పనికట్టుకుని నాపై అక్కసును మరోసారి ప్రదర్శించారు. నాక్ సమయంలోనే పలు ఫిర్యాదులు చేశారు. గతంలో 100 శాతం ఫిజికల్ పరిశీలన జరిగేది. ప్రస్తుతం 70 శాతం ఆన్‌లైన్‌లో, మిగిలిన 30 శాతం ఫిజికల్ పరిశీలన జరుగుతుండటంతో అన్ని కాలేజీలకు గ్రేడ్ పాయింట్లు, సీజీపీఏ పాయింట్లు తగ్గుతున్నాయి. వాటితో పోలిస్తే మాత్రం శ్రీకాకుళం జీడీసీ మెన్ కాలేజ్‌కు మెరుగైన గ్రేడే వచ్చిందని భావిస్తున్నాం. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– డాక్టర్ పెంకి సురేఖ, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

వాసవీ మాతకు విశేష పూజలు



నగరంలోని చిన్నబజారు వీధిలో వాసవి కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖర శర్మ, వెంకటరమణశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

గుర్తులు ఎందుకంటే?



రణస్థలంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద నలుపు, తెలుపు కలగలిపిన సింబల్స్‌ను హైవే అధికారులు అతికించారు. ఇవి ఎందుకు అతికించారో తెలియక స్థానికులు అయోమయానికి గురయ్యారు. దీనిపై హైవే ఇంజినీర్లకు వివరణ కోరగా టోపోగ్రఫీ (స్థలాకృతి) సర్వే కోసం గుర్తులు అతికించామని, వీటి ద్వారా భూ ఉపరితలం, ఎత్తు పల్లాలు, సమ దూరం పక్కాగా లెక్కించేందుకు వీలుంటుందని తెలిపారు.

- రణస్థలం

న్యాయం జరిగే వరకు పోరాటం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బాధిత విద్యార్థినికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని అఖిల భారతీయ విద్యార్థి సంఘ నాయకులు స్పష్టం చేశారు. శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ-3 హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడారు. ఇటువంటి సంఘటనలు జరగడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కలెక్టర్, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిలక్ష్మి, సాక్షి, మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలి

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినిపై దాడికి పాల్పడిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితురాలిని శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

క్లుప్తంగా

రక్తదానానికి స్పందన



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రజాసేవకు చిరునామాగా గొలివె అప్పారావునాయుడు నిలుస్తారని డాక్టర్ గొండు గంగాధర్ అన్నారు. అప్పారావునాయుడు వర్ధంతి సందర్భంగా శుక్రవారం రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిటిజన్ ఫోరం కార్యదర్శి జి.ఎల్.ఎల్.నర్సునాయుడు మాట్లాడుతూ తన తండ్రి కోటబొమ్మాళి మండలం రేగులపాడు సర్పంచ్‌గా, గ్రామ మునసబు, గ్రామ కరణంగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, లైన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, డాక్టర్ నిక్కు అప్పన్న, ఎల్.గోవిందు, పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత



వాకింగ్ స్టాండ్ అందిస్తున్న దాతలు, ఎస్ఐ

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ సేవాభావం అలవరుచుకోవాలని ఒకటో పట్టణ ఎస్ఐ కె.హరికృష్ణ అన్నారు. కాకినాడ ఆదిత్య కళాశాల మేనేజ్‌మెంట్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న జె.ప్రభాకర్, స్వాతి దంపతుల సహకారంతో బొమ్మాలి పోలినాయుడు అనే దివ్యాంగుడికి శుక్రవారం వాకింగ్ స్టాండ్‌ను వితరణగా అందించారు. అదే విధంగా మరో దివ్యాంగుడు కూన రవికి మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ రౌత్ సహకారంతో దుప్పట్లు, దుస్తులు, తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సేవకులు ఉర్లం శివతేజ, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ సభ్యులు వాన జోగారావు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



డివైడర్‌పైకి ఎక్కిన లారీ

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం సమీపంలోని బైపాస్ సమీపంలో శుక్రవారం జాతీయ రహదారి డివైడర్‌పైకి లారీ దూసుకొచ్చింది. విశాఖపట్నం వైపు వెళ్తుండగా అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్, సహాయకుడి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ధర్మబద్ధంగా జీవించాలి



విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: ధర్మబద్ధంగా జీవించాలని వేదాంతం చెబుతోందని రాజమండ్రికి చెందిన శృంగేరి శారదాపీఠం ఆస్థాన పండితులు విశ్వనాథ గోపాలకృష్ణ అన్నారు. బాపూజీ కళామందిర్‌లో గుజరాతీపేటకు చెందిన రాజరాజేశ్వరీ లలితా త్రిపుర సుందరీ దేవి పీఠం నిర్వహణలో రెండురోజుల పాటు వేదాంత శ్రవణం, సంస్కార సుధ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణ చేస్తూ మానవ జీవితం ఎంతో విలువైనదన్నారు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు ఊహించుకొని చాలామంది అజ్ఞానంలో ఉన్నారని, ఇవి ద్వేషానికి, దుఃఖానికి దారి తీస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, పెంట కార్తికేయశర్మ, గుమ్మా నగేష్, భాస్కరభట్ల శ్రీరామశర్మ, పులఖండం శ్రీనివాసరావు, వి.కామేశ్వరరావు, నిష్టల నర్సింహమూర్తి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వీధి బాలల రక్షణ, సంక్షేమం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా పరిషత్ వద్ద ఉన్న వీధి బాలల సదనాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడున్న సుమారు 72 మంది బాలలతో మాట్లాడుతూ క్రమశిక్షణ, నాణ్యమైన విద్యతోనే మంచి భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. భిక్షాటన, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ 1098 ద్వారా అనాథ బాలలను గుర్తించి పరిపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ అధికారి రమణ, డి.సీతారాములు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల సూరిబాబు విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: దివంగత మాజీ జెడ్పీచైర్మన్ ఎచ్చెర్ల వెంకట సూర్యనారాయణ (సూరిబాబు) విగ్రహాన్ని కిల్లిపాలెం గ్రామంలో శుక్రవారం వారి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సర్పంచ్ స్థాయి నుంచి జెడ్పీచైర్మన్ వరకూ పలు దఫాలుగా ప్రజలకు సేవలందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, మాజీ కేంద్రమంత్రి కిల్లికృపారాణి, గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ శాసన సభ్యులు రెడ్డిశాంతి, గుండ లక్ష్మీదేవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు ఎం.వి.పద్మావతి, పైడిశెట్టి జయంతి, జెడ్పీటీసీలు రుప్పదివ్య, ఎచ్చెర్ల శ్రీధర్, ధర్మాన రామ్మనోహర్‌నాయుడు, ఎంపీపీ అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ చిట్టి జనార్దనరావు, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు హాజరై నివాళులు అర్పించారు.

సత్యసాయి నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభం



స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్‌కాలనీలో సత్యసాయి సేవా సమితి ఏర్పాటు చేసిన నూతన శాశ్వత నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ శుక్రవారం ప్రారంభించారు. బెడ్‌సైడ్ అసిస్టెన్స్ (రోగులకు సేవ చేయడం) కోర్సుకు ఈ కేంద్రం అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కలిసి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తొలి విడతగా 15మందికి ఆరునెలల పాటు రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం హిమవాహ్ని రత్నాకర్ కొత్త వసతి గృహాన్ని ప్రారంభించారు. పలువురికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, నేషనల్ సేవా దళ్ కో–ఆర్డినేటర్ కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు సురేంద్ర, రాష్ట్ర సేవాదళ్ కో–ఆర్డినేటర్ శ్యాంప్రసాద్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కృష్ణకుమార్, కె.నాగప్రసాద్, అమ్మాజీ, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, బోయిన నరసింహమూర్తి, కన్వీనర్ ఎ.ప్రసాదరావు, సేవాదళ్, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చాలి



కోటపాలెంలో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

రణస్థలం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించిన వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేయాలని డీఎల్‌పీవో ఐ.వి.రమణ సూచించారు. రణస్థలం మండలం కోటపాలెం, పైడి భీమవరంలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి సేకరణ కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయలను చిన్నారులకు ఆహారంగా అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏ.ప్రకాశ్‌రావు, మాజీ సర్పంచ్ సుంకర ధనుంజయరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సూర్య నమస్కారాలు



ముద్దాడపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం సూర్య నమస్కారాలు చేశారు. రథసప్తమి నేపథ్యంలో ఉపాధ్యాయులు పిల్లలతో సూర్యనమస్కారాలు చేయించి పండగ ప్రాధాన్యత, ఆసనాల ఆవశ్యకతను వివరించారు. -ఎచ్చెర్ల క్యాంపస్

సత్తాచాటిన విజయ్



ఐదు వికెట్లతో రాణించిన త్రిపురాణ విజయ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్, ఐపీఎల్ క్రీడాకారుడు త్రిపురాణ విజయ్ సత్తా చాటాడు. ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో ఐదు వికెట్లతో విజృంభించాడు. విజయనగరంలో రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో అద్భుతమైన స్పిన్ మ్యాజిక్‌తో ఆకట్టుకున్నాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ 79.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న త్రిపురాన విజయ్ 27 ఓవర్లలో 62 పరుగులిచ్చి ఐదు కీలక వికెట్లు పడగొట్టి రాణించాడు. ఇందులో పది ఓవర్లు మేడిన్లు ఉండటం విశేషం. విజయ్ రాణింపు పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షకార్యదర్శులు పీవైఎస్ శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ అహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ ఎస్.రవికుమార్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో సెలక్టర్లు

ఎచ్చెర్ల క్యాంపస్ : అంతర విశ్వవిద్యాలయాల్లో పాల్గొనే బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఎచ్చెర్లలోని ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిపార్టమెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు అనుబంధ కళాశాలల నుంచి 20 మంది హాజరు కాగా 15 మందిని ఎంపిక చేశారు. మార్చి 29 నుంచి ఏప్రిల్ 1 వరకు అలగప్ప విశ్వవిద్యాలయంలో ఈ పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో సెలక్టర్లు రాజకుమార్, మధు, మోహన్, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ పాల్గొన్నారు.

మోడల్ ప్రాథమిక పాఠశాల ఎంపికకు సన్నాహాలు

ఎచ్చెర్ల: ప్రాథమిక పాఠశాలలో తగిన ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎంపికచేయనున్నామని మెట్టవలస క్లస్టర్ హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం లావేరు మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా క్లస్టర్ పరిధిలోని పాఠశాలలను సందర్శిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీ పిల్ల మహేశ్వరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

జి.సిగడాం: మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో మెలిగి ఎన్నికల కోడ్‌ను సమర్థంగా నిర్వహించాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎం.శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం జి.సిగడాంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్లు ఎస్.నిర్మల, కె గాయిత్రి, ఆర్ఐ ఏ.రాధ, వీఆర్ఓ భూపతి నర్సింగరావు, పొట్నూరు జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం రాజశ్యామల యంత్ర పూజలు, హోమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయదుర్గకు విశేష అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నానుబాలవీధిలోని విజయదుర్గా దేవి ఆలయంలో పుష్యమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిగాయి.